# ఎర మింగిన చేప

చెరువొడ్డున చెట్టుకి ఆనుకొని కూర్చున్నాడు వెంకటరావు. శీతాకాలం ఎండ నును వెచ్చగా వంటిని తాకుతున్నది. చెరువులోని కొంగలు ఒడ్డుకువచ్చి ఎండకాచుకుంటున్నాయి. కొన్నికొంగలు ఒంటికాలుమీద నిలబడి జపంచేస్తూ నీటిపై తేలి, తళుక్కున మెరిసి, నోటి కందకుండా తప్పించుకొనిపోయిన చేపల్ని తలుచకొని జపంవిడిచి లొట్టలు వేస్తున్నాయి.

చుట్టుపక్కల ఆడవాళ్ళు నీళ్ళలో వో మునుగు మునిగి, తెల్లగా తోమిన ఇత్తడి బిందెలనిండా నీళ్ళు ముంచుకు పోతున్నారు. ఇంకొందరు అక్కడికక్కడే చాకిరేవుపెట్టి తీరుబాటుగా కబుర్లు, కథలు చెప్పుకొంటూ మధ్య మధ్య బట్టలుతుక్కొంటున్నారు. పిల్లలతల్లులు కొందరు "చలి" అని గట్టెక్కి మారాంచేస్తున్న పిల్లల్ని రెక్కపట్టుకు నీళ్ళలోకి లాగి, పోతుల్ని కడిగినట్లు తోమి, తోమి కడుగుతున్నారు.

ఏదో పిల్లలు అల్లరికోసం అరుస్తారేకాని, చెరువులో నీళ్లు అంత చల్లగా వుండవు.... అనుకొన్నాడు వెంకటరావు. రోజూ అతడీపాటికి స్నానం, ధ్యానం ముగించి ఇంటిదారిపడతాడు. కాని ఆ రోజు ఏదో కారణాన అతనిలో స్తబ్ధత ఏర్పడింది. అంత తొందరగా స్నానంచేసి ఇంటికి పోకపోతే మించిపోయే రాచకార్యాలేం లేవు అనిపించింది. గట్టుమీద కూర్చుని చెరువులో చేపలుపడుతున్న జాలరిపిల్లల్ని చూస్తూ చాలకాలం

గడిపేదు. ఆ పిల్లలు రోజూ తెలతెలవారుతుండగా చేపలవేట మొదలు పెడతారు. ఎండ నడినెత్తికెక్కి కడుపులో కరకర లాడేవరకు ఆ పనిలో నిమగ్నమయ్యే వుంటారు. ఇంత పరిశ్రమకి ఫలితంగా దొరికినరోజు ఏ కొద్దిపాటో చిన్న చిన్న చేపలు దొరుకుతాయి. లేనిరోజు అవీ లేదు. అయినా తమ ప్రయత్నం మాత్రం వాళ్లు మానరు. ముల్లు చివరికి ఎరకట్టి గాలం నీటిలో వేసి ఆశగా ఎదురు చూస్తుంటారు.

ఎన్నో చేపలు నీటిలో మెరుస్తూ అటు ఇటు తిరుగుతూంటాయి. కొన్ని ఎరకు ఆ మాత్రం యీ మాత్రం దూరంలో తప్పిపోతాయి. కొన్ని చూసినా ఏం తిండిలెద్దూ అనే విరక్తి భావంతో వదలిపెడతాయేమో అనిపించేది వెంకటరావుకి. లేకపోతే కంటపడిన ఆహారాన్ని అంత దగ్గరలో ఒదులుకొని దూరంగా ఎందుకు వెతుక్కొంటూ పోతాయి, బహుశ వాటి ఆయువు ఇంకా మూడివుండదు; లేక ఆ మాయా వాగురం లోని మర్మంగురించి వాటి అమ్మో, అమ్మమ్మో హెచ్చరించి వుంటారు- అనుకొనేవాడు వెంకటరావు.

కాని, సంతతం కవ్వించే ఆ ఆకర్షణనుంచి ఎంతకాలం తప్పుకు తిరగ్గలవు? ఎప్పుడో అప్పుడు కడుపు నిండుతుందన్న ఆశతో, అయాచితంగా ఆహారం దొరికిందన్న సంతోషంతో ఆ ఎరనికాస్తా మింగి ఊరుకుంటాయి. మొదట రుచిగా నోట చవులూరించే ఆ ఆహారం పొట్టలో తమకుక్కిన ముల్లులాగాదిగి, ప్రాణం గిలగిల్లాడినప్పుడు వాటికి తెలుస్తుందేమో? తాము మోసపోయామని విచారిస్తాయేమో? కాని ఫలితం శూన్యం. అప్పటికే జరగవలసిన క్రియ జరిగిపోతుంది. ఇంక వాటికి విముక్తి వుండదు. అంతటితో ఆ బ్రతుకు సరి.

మోసపోయి ఎరనిమింగి గిలగిల్లాడేవి చేపలొక్కటేనా. అని ఆలో

బించేవాడు వెంకటరావు. కాదు, ప్రతి ప్రాణి తనజీవితంలో ఏదో ఒకమైన ఎరలో తగుల్కొంటూనే వుంటుంది. అతి తెలివైన వాణ్ణి అనుకొని మురిసిపోతున్న మనిషి కూడా ఒక్కొసారి ఆ ఆకర్షణకి లోనై ఆ ఎరని కమ్మగా అరగిద్దామని ఆశపడతాడు కాని ఒకసారి మింగినదాన్ని తిరిగి బయటికి తియ్యలేడు. ఆ బాధ అనుభవించవలసిందే.

వెంకటరావు కెందుకో ఆ రోజు ఆలోచనలన్నీ ఎప్పుడో గడిచి పోయిన తన జీవితం చుట్టూ. ఎదురుగా నీటిలో పరుగులు పెడుతున్న చేపల చుట్టూ తిరుగుతున్నాయని పించింది. "ఛీ.... ఈ చేపలకీ నాకూ సామ్యం ఏమిటి? రెండింటిని కలిపి ఆలోచించడమేమిటి?" అనుకున్నాడు. జాలరి కుర్రాడు హుషారుగా ఈలవేస్తూ గాలం పైకి లాగేడు. గాలంచివర సూర్యకాంతిలో తళతళ మెరుస్తున్న చేప, కడుపులోని రక్తాన్ని, కన్నీటిని కలిపి కారుస్తున్నది. జాలరి కుర్రవాడు చేపని పదిలంగా తీసి ప్రక్కన ఇసుకలో పెట్టేడు. ఎరమింగి ఒడ్డున ఇసుకలో గిలగిల కొట్టుకొంటున్నచేప "నీకూ నాకూ సామ్యంలేదా వెంకటరావూ!" అని ప్రశ్నించింది.

వెంకటరావుకి, ఆ సామ్యం అట్టే గాలించనవసరం లేకుండానే దొరికిపోయింది. తమ ఇద్దరిమధ్యగల సామ్యమేమిటో తనకి తనే అప్ప చెప్పుకొంటున్నాడు వెంకటరావు.

అర వైరూపాల జీతంగల ఉద్యోగాన్ని, అమాయకురాలైన అన్నపూర్ణని అతనిచేతుల్లో పెట్టి తన బాధ్యత తీరిపోయినట్లు పరలోక ప్రయాణం కట్టేడు వెంకట్రావు తండ్రి. అన్నపూర్ణ తలిదండ్రులూ ఆపాటి బాధ్యతకూడ నిర్వహించలేదు. అన్నీ మేనమామకే వదలి ఏనాడో తరలిపోయేరు. వెంకటరావు కాళ్ళు కడిగి, కన్యను చేతిలో పెట్టి "ఇదిగో అబ్బాయి ఇంక నీదే పూచీ" అని బరువు దింపుకున్నాడు అన్నపూర్ణ మేనమామ.

పదేళ్ళు అటునుండి ఇటుతిరిగేసరికి కరువుకాటకాల భత్యాల మూలంగా వెంకటరావు జీతం నూటపాతిక్కి పెరిగింది. జీతంతో పాటు సంసారంకూడా పెరక్కపోతే ఏం అందంగా వుంటుందని అన్నపూర్ణ ముగ్గురు బిడ్డల్ని కనింది. ఫామిలీ ప్లానింగు వాళ్ళ ప్రబోధాలు చెవినిపడి బుర్రకెక్కేసరికి అన్నపూర్ణ నాల్గవబిడ్డకి స్వాగతం పలికింది సిద్ధంగా ఉంది.

ఇంతకన్న ఎక్కువమంది బిడ్డల్ని కనకూడదని వెంకటరావు తీర్మానించుకున్న నెలరోజులకే అన్నపూర్ణ నాలుగో బిడ్డని వెంటబెట్టుకొని తలిదండ్రుల్ని చూసొస్తానని స్వర్గానికి ప్రయాణం కట్టింది.

కష్టంలో ఉన్న వెంకటరావుని అన్నపూర్ణ అమ్మమ్మ ఆదుకొన్నది. "నీకేం భయంలేదు నాయనా! నీ బిడ్డల్ని నేను చూచుకొంటాను. భగవంతుడు రక్షించి, పదేళ్ళు చల్లగా గడచిపోతే నీ పిల్లలు చేతికందుతారు" అన్నాది ఓదార్పుగా.

అన్నపూర్ణ పోయిన మరునాటినుండి ముగ్గురు పిల్లలతండ్రి, ముప్ఫైఏళ్ళు పై బడ్డ నూటపాతిక రూపాయల గుమాస్తాగారింటిచుట్టూ కన్యాదాతలు కాలికి బలపాలు కట్టుకు తిరిగేరు. అయినా వెంకటరావు చలించలేదు. కళ్ళెదుట నిల్చిన ఆడపిల్లలకి, రవివర్మ ఫొటోలో మేనక ముందు నిల్చిన విశ్వామిత్రుడి పోజులో చెయ్యడ్డం పెట్టేడు. హితవు చెప్పబోయిన పెద్దలముందు "నాకీ జన్మకి ఇంతే సౌఖ్యం రాసిపెట్టున్నది. లేకపోతే అన్నపూర్ణే బ్రతికుండేది" అని కళ్ళనీళ్ళు కార్చేవాడు.

వెంకటరావుకోసం ఆరేళ్ళపాటు స్వర్గలోక ప్రయాణం వాయిదా వేసుకొన్న అన్నపూర్ణ అమ్మమ్మ మాటమాత్రంగానైనా చెప్పకుండా ఒకరోజు రాత్రికిరాత్రే పరలోకానికి పరారయింది. పాపం వెంకటరావు రెండుపూటలా చెయ్యికాల్చుకొంటూ పిల్లలది, తనదీ కడుపు నింపుకొంటూ కాలాన్ని ఈడ్చుకొచ్చేడు.

నిజానికి చేపకి, వెంకటరావుకి వున్న సామ్యంకోసమే ఈ కథైతే అతడు ఇక్కడినుంచే ఆలోచించవచ్చు. అయినా ఎందుకో తన జీవితానికి శ్రీకారం చుట్టినప్పటినుండి తనకథ చెప్పుకోడం వెంకటరావుకోని సరదా.

ఈడొచ్చిన ఆడపిల్ల లిద్దరికీ బరంపురం పట్టుపంచె శృంగవరపు కోట కంచెంబులాంఛనాలుగా ఇచ్చి ఒక వరహా వరకట్నంగా ఇచ్చి వైభవంగా పెళ్ళిళ్ళు చేసేసు వెంకటరావు. పసుపుకొమ్ము, కొబ్బరి బొండం సారెగా తీసుకొని ఆడపిల్లలు అత్తారింటి ముఖం పట్టేక మిగిలింది వెంకటరావు. మెట్రిక్యులేషన్ పాసైన కొడుకు. పిల్లాడి చదువు కోసమని అధికార్ల కాళ్లు పట్టుకొని పట్నం ట్రాన్స్‌ఫర్ చేయించుకొన్నాడు వెంకటరావు. అక్కడ ఒకభాగం ఇంట్లో అద్దెకిదిగి-అమ్మయ్యా అని స్థిమితపడ్డాడు. తన బరువు బాధ్యతలు చాలావరకు తీరిపోయేయని సంతోషించేడు.

ఆ ఇంటాయన వయసుమళ్ళిన వృద్ధుడు. అతనికున్న బంధమల్లా, పెంకులు చెల్లా చెదరై సూర్యచంద్రుల్ని ఇంట్లో కట్టివేసిన ఆ యిల్లు, తల్లిదండ్రుల్ని కోల్పోయి గుండెలమీద కుంపటిలావున్న వయసులోవున్న మనుమరాలు. ఆ పిల్లపేరు అరుణ. చురుకైనపిల్ల తాతయ్యంటే అరుణకి చెప్పలేనంత అభిమానం. తాతయ్య ఏపనైనా కళ్ళతో ఆదేశిస్తే చాలు "తూచా" తప్పకుండా చేసుకుపోతుంది.

ఇల్లు, వాకిలి పొందిగ్గా దిద్దుకొని, ముసలాయనకి కావలసినరీతిగా వండిపెట్టేది. వెంకటరావంటే ముసలాయనకి, అరుణకి చాలా అభిమానం. "మీరేంవండుకుంటారు. ఆ కూరా, బియ్యం ఇటు పడెయ్యండి. మా అరుణ వండి, పడేస్తుంది" అనేవాడు ముసలాయన. ఒకదానికి మరొకటి కల్పించి నాలుగురకాల పదార్థాలు రుచికరంగా వండి నట్టింట పెట్టే దిఅరుణ. అన్నపూర్ణ పోయేక అంతరుచికరమైన భోజనం వెంకట

రావు తిన్నది తిరిగి ఆ రోజుల్లోనే. తమ ఇంటితోపాటు వెంకటరావు వాటా కూడా తుడిచి శుభ్రపరిచేది అరుణ. మగాడి జీవితానికి ఆడదాని అవశ్యకత ఆనాడు కొత్తగా అర్థమైనట్లయింది వెంకటరావుకి.

“మరీ అంత పూసుకు తిరగడమేమిటి? ఈ సపర్యలన్నీ ఎవరుకో లేదు?” అనేవాడు కొడుకు. అరుణన్నా, ఆ ముసలాడన్నా ఆ పిల్లాడికి ఎందుకో తగని కోపం. బహుశ తనని తప్పుకొంటూ తండ్రిని రాసుకొంటూ అరుణ తిరుగుతూండడమే కారణం కావచ్చు. “ఇలా కల్లబొల్లి కబుర్లు చెప్పి ఏదో లాగాలనుకొంటున్నారు!” అనేవాడు.

“వాళ్ళకి మనదగ్గరినుండి లాగేందుకేముంటుంది? పాపం మంచి వాళ్ళు కాబట్టి, మనకి కడుపులో చల్ల కదలకుండా అన్నీ అమర్చి పెడుతున్నారు. అరుణ మనకోసం ఎంత కష్టపడుతున్నది?” అనేవాడు వెంకటరావు. “ఏమైనా ఆ పిల్ల మనింట్లో అయినదానికి కానిదానికి పూసుకు తిరగడం, నీ వైపు అదోలా చూడ్డం నాకేం బాగాలేదు” అని తన అక్కసు వెళ్ళబుచ్చేవాడు కొడుకు.

“ఎలా చూస్తుందిరా?” కొడుకునైతే మాటవరసకి ప్రశ్నించేడే కాని, ఎలా చూస్తుందో వెంకటరావుకి తెలియకకాదు. ఆ పిల్ల అలా చూస్తుంటే అతనికి ఎంతో సంతోషంగా వుండేది. ఏదో కమ్మని కలల్లో తేలిగా తేలిపోతున్నట్లు మల్లెపూల పరిమళాలు, చల్లని పిల్లతెమ్మెర, శుక, పిక కూజితాలు కోకిల తియ్యనిగానం ఇంకా ఇలాటివే ఎన్నో తనని చుట్టుముట్టినట్లనిపించేది. ఏ అద్భుత శక్తివల్లనైనా రాత్రికి రాత్రి తను పాతికేళ్ళ పడుచువాడు అయిపోకూడదా అని ఆశించేవాడు.

అతడు ఆశించినట్లు పడుచువాడు కాలేకపోయినా ఆ పిల్ల చూపులకు కొడుకు మాడకుండా చూపులతోనే జవాబు నిచ్చేవాడు.

ఒకరోజున అకస్మాత్తుగా అరుణ తాతగారికి అదివరకు ఎంత కాలంగానో వున్న ఉబ్బసజబ్బు విజృంభించి ప్రాణంమీదికొచ్చింది. ఇంటి

మీదున్న నాలుగు పెంకులు ఎగిరిపోయేలా దగ్గుతూ మధ్యమధ్య మనుమరాలి పెళ్ళి చెయ్యకుండా కన్ను మూస్తున్నందుకు రాగాలు పెట్టేడు ముసలాయన.

"నీ కన్యాయం చేసేనమ్మా! నిన్నొంటరిగా వదలిపోతున్నానే తల్లీ! ఇంక నిన్నుచూసే వాళ్లెవరే అమ్మా! నీకు పెళ్ళెలా అవుతుందే అరుణా" అంటూ చిన్నపిల్లాడిలా మనుమరాల్ని పట్టుకొని ఏడుస్తున్న తాతగారిని చూసేసరికి వెంకటరావు గుండె కరిగిపోయింది. అలా కరిగి కారుతున్న గుండెలో అరుణ అమాయకపు చూపు, మైనంమీద బొమ్మలా హత్తుకు పోయింది.

"మీకు అభ్యంతరం లేకపోతే అరుణను నేను పెళ్లాడుతాను తాతగారూ! నాల్గురోజులకల్లా మీకు నయమౌతుంది. మీ చేతుల మీదుగానే మనుమరాలి పెళ్ళి చేద్దురుగాని" అని ముసలాయనకి ధైర్యం చెప్పేడు వెంకటరావు.

అతని నోటిమాట చలువవల్ల ముసలాయనకి నాల్గురోజులలోపునే నయమయింది. ఓ శుభముహూర్తాన అరుణ వెంకటరావు భార్యయింది. ముసలాయన నల్లమందు బాకీలకి ఇల్లు అమ్మి, అప్పుతీరగా మిగిలిన సొమ్ము ఆ నల్లమందు కొట్లోనే జమకట్టి వచ్చేడు వెంకటరావు. పాపం ఇంకా ఆ సొమ్ములో అరవై పైసలు మిగిలుండగానే కన్నుమూసేడు అరుణ తాతయ్య.

అరుణ కాపురాని కొచ్చిన ఒకటి రెండేళ్ళు సుఖంగా ఏం గడిచేయో? అటు తర్వాత ఏ సంక్రాం తీవాడింట్లో ఇంగువ, వెల్లుల్లి వాసనలని వెదజల్లకుండా గడవలేదు. వెంకటరావు రిటైరు అయేనాటికి అరుణ ఆరుగురు ఆడపిల్లల్ని కని ఏదోసారి వంశోద్ధారకుడు పుడతాడని ఆశగా చూస్తున్నది. వెంకటరావుకి కొడుకున్నా, ఆమె కడుపున మగపిల్లాడు పుట్టందే ఆమెకి తృప్తి కలుగలేదు. మరి. అందుకే మొదటి కాన్పునుంచి

ఈసారి మగపిల్లాడు అని ఆశతో ఎదురు చూస్తున్నది ఆ భగవంతుడు కరుణించకపోతే ఆమేం చెయ్యగలదు? నిరీక్షించడం తప్ప!

అన్నపూర్ణతోనే తన జీవితంలో సుఖం అంతమై పోయిందను కొన్న వెంకటరావు, అరుణ కన్పించాక తన అభిప్రాయం తప్పను కున్నాడు. తను కోల్పోయిన జీవితానందాన్ని తిరిగి పొందగోరి ఆశతో అడుగులు ముందుకు వేసేడు.

ఆలోచనలలో, ఆశలలో అతని జీవనలత బాగా చిగురించి పుష్పించింది. కాని ఆచరణ కొచ్చేసరికి ఆ లత సరిగా పాలన, పోషణలేక తగినన్ని నీళ్ళులేక ముడుచుకుపోయి ముణగాకువేసి వాడిపోయింది.

ఇంటికి వచ్చేసరికి ఈగల్లా ముసిరేకూతుళ్ళనీ, ఏడాదిలో ఆర్నెల్లు బానకడుపుతో, ఊచకాళ్ళతో ఊగులాడే భార్యనీ చూసి, తను ఆర్థికంగా అదుకోలేనంత సంసారాన్ని పెంచుకొన్నందుకు లోలోపల కుమిలి పోవడం తప్ప వెంకటరావుకి వేరుమార్గం లేకుండాపోయింది. అతను ఆశించిన సుఖజీవనం కుళ్ళి, మురుగు కంపుకొడుతున్న సమయాల్లో, దాన్ని పెళ్ళగించి అతనికి మరీబాధ కల్గించేవాడు కొడుకు.

"లేకేం చేపా! నీకూ,నాకూ చాలా సామ్యం వున్నది. ఇద్దరంవెనక విపత్తులు చూసుకోకుండా కడుపు నిండుతుందన్న ఆశతో, వాంచ తీరుతుందన్న ప్రలోభంతో కళ్ళు మూసుకొని ఎరమింగి వూరుకొన్నాం. ఇప్పుడది మనప్రాణాలను తోడుతున్నది. ఈ బాధ అనుభవించటం మినహా మనకి వేరు మార్గంలేదు" అన్నాడు వెంకటరావు.

కాని ఆ మాటలు వినిందికి ఎరమింగినచేప అక్కడ లేదు అది జాలరి వాడింట్లో కుండలో ఉడుకుతున్నాది.

...(0)..